క్లుప్తంగా

బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకంలోని ఆలయాల్లో ఉగాది నుంచి శ్రీరామనవమి తదుపరి దశమి వరకు వసంత నవరాత్రులు జరుగుతున్నాయి. ప్రత్యేక పూజల్లో బూచేపల్లి వెంకాయమ్మతో పాటు దర్శి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి భార్య నందిని పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చనలు చేశారు.

టెన్నిస్ కోచ్ సతీష్ గుండెపోటుతో మృతి

గిద్దలూరు రూరల్: గిద్దలూరుకు చెందిన టెన్నిస్ కోచ్ బి.సతీష్ (52) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. ప్రకాశం జిల్లా లాన్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి.. సతీష్ స్వగృహంలోని ఆయన భౌతిక దేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట క్రీడాకారులు కోటయ్య గౌడ్, మురళి, ఖాదర్‌బాషా, శేఖర్, టపావళి, రామచంద్రారెడ్డి, రాఘవులు ఉన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


చిననాగేశును పరామర్శిస్తున్న బూచేపల్లి

ముండ్లమూరు: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి బుధవారం పరామర్శించారు. మండలంలోని వేంపాడుకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు ఆరోగ్యం బాగాలేక వైద్యశాలలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని పరామర్శించి ఓదార్చారు. గ్రామానికి చెందిన గండి భాస్కరరావు వెన్నెముక ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గండి యాకోబు గుండె ఆపరేషన్ చేపించుకోగా, గండి యేసేబు, ఇంటూరి లీలమ్మ, గోపనబోయిన చిననాగేశు, చల్లా సంతోషమ్మతో పాటు మరి కొంత మందిని పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ వెంకటరత్నం, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మాజీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, మేదరమెట్ల వీరయ్య, సోమేపల్లి సుబ్బారావు, అంబటి వెంకటేశ్వరరెడ్డి, గండి దానియేలు, సురేష్, ఎంపీటీసీ ఏలియా, గండి అబ్రహం ఉన్నారు.

ఫ్యాను గుర్తుపై ఓటు.. సంక్షేమానికి చోటు


ప్రచారంలో పాల్గొన్న వెన్నా హనుమారెడ్డి, జెడ్పీటీసీ ఇందిర, నాయకులు

తర్లుపాడు: ఫ్యాను గుర్తుపై ఓటు సంక్షేమానికి, అభివృద్ధికి రాచబాట అని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం తర్లుపాడు, బొందలపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. మార్కాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ఇంటివద్దకే వచ్చాయని గుర్తు చేశారు. సంక్షేమం కొనసాగాలంటే మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, చెన్నకేశవులు, సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మురారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు డి.పెద్ద మస్తాన్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, సర్పంచ్ వరాలు, ఎంపీటీసీ అంకమ్మ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు వెన్నా సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు మల్లికార్జునరెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ లోకల్ వద్దు..లోకల్ ముద్దు!

- బూచేపల్లికి రోజురోజుకూ పెరుగుతున్న మద్దతు
- అన్ని విషయాల్లోనూ వెనుకంజలో కూటమి అభ్యర్థి


బూచేపల్లి ప్రచారానికి కాటంవారిపల్లెలో హాజరైన జనసందోహం

కురిచేడు: ఎన్నికల సందర్భంగా దర్శి నియోజకవర్గ ప్రజలు అభ్యర్థుల విషయంలో లోకల్–నాన్‌లోకల్ వ్యత్యాసాలను బేరీజు వేసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో కనిపించి అనంతరం అదృశ్యమయ్యే నాయకులను ఎన్నుకుని ఇబ్బందులు పడేకన్నా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే లోకల్ అభ్యర్థులను ఎన్నుకుంటే ఏ అవసరమైనా వెళ్లి సమస్యలు చెప్పుకోవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతం దర్శి అసెంబ్లీకి పోటీచేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఆయన తండ్రి సుబ్బారెడ్డి, తల్లి వెంకాయమ్మలు దర్శి నియోజకవర్గంలో 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రెండుసార్లు ఎమ్మెల్యేగా పదవులు చేసి అందరికీ సుపరిచితులు. వెంకాయమ్మ ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతూ తన వద్దకు వెళ్లి సమస్యలు తెలిపిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఉంటారు. అందరిలో ఒకరిగా ఉన్న బూచేపల్లి కుటుంబానికి దర్శి నియోజకవర్గ ప్రజలకు ఎనలేని అవినాభావ సంబంధం కొనసాగుతోంది. నియోజకవర్గంలో ఎందరో బడుగు, బలహీన వర్గాల వారు బూచేపల్లి కుటుంబం సహాయ సహకారాలు పొందిన వారున్నారు. ఎందరికో ఆపన్న హస్తం అందించి ఆరోగ్య సమస్యలు తీర్చిన కుటుంబం. నేటికీ సహాయం కోసం వారి తలుపు తడితే లేదు,కాదు అనే సమాధానం లేకుండా తమకు చేతనైనంత సహాయం చేసి సంతృప్తి పరిచి పంపుతారని ప్రజలు కొనియాడుతున్నారు. ఎన్నో దేవాలయాలకు ఆర్థిక సాయంతో పాటు భక్తులకు, సభలు, సమావేశాల సందర్భంగా అన్నదానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటారని చర్చించుకుంటున్నారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా విద్యకు, వైద్యానికి సహాయ సహకారాలు అందిస్తున్నారని, పదవి కన్నా సేవే ముఖ్యమని వారు ప్రజలకు సాయం చేస్తుంటాని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వారికి ప్రతి గ్రామంలో హారతులిచ్చి పూలతో ఘనంగా స్వాగతిస్తున్నారు. నీ వెంటే మేమంతా అనే సంకేతాలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు టీడీపీ తరఫున పోటీ చేసి గెలిస్తే పదవీ కాలం అనంతరం, ఓడిపోతే ఎన్నికల అనంతరం ప్రజలకు కనిపించిన నాయకులు లేరని బూచేపల్లి కుటుంబం 20 సంవత్సరాల నుంచి నియోజకవర్గ ప్రజలతో మమేకమై ఉంటోందని ఈ ఎన్నికల సందర్భంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జంకె, శ్రావణి వెంకటేశ్వర్లు

జనరంజక పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, జంకెలను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

మార్కాపురం/మార్కాపురం రూరల్: జనరంజక పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు కోరారు. బుధవారం రాత్రి మండలంలోని బోడపాడు, మన్నెవారిపల్లి, నాయుడుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఫ్యాను గుర్తుపై ఓటేసి తనతోపాటు ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి ముందుకువెళ్లాలన్నా సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా అన్నా రాంబాబు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డిని గ్రామస్తులు గజమాలలతో సత్కరించారు. మార్కాపురం ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ ఎంపీపీ పోలయ్య, సర్పంచ్‌లు వెన్నా మహేశ్వరి సుబ్బారెడ్డి, కొండలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి రంగారెడ్డి, మండల కన్వీనర్ వెంకటేశ్వరయాదవ్, జేసీఎస్ కన్వీనర్ పొందుగుల శ్రీనివాసరెడ్డి, బొగ్గు రవికుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 30 కుటుంబాలు

పొదిలి విశ్వనాథపురం 10వ వార్డు బీసీ కాలనీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి కాపు సంఘ నేత శ్రావణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మార్కాపురం మండలం బోడపాడు గ్రామానికి వచ్చి ఎమ్మెల్యే అన్నా రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అన్నా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. శ్రావణి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆశయాలు, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి 30 కుటుంబాలవారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన పాశం కొండయ్య, జి రామారావు, మధు, జిందాల్ వలి, మల్లి, నరేంద్ర, ఆది, మారాసి వెంకటేశ్వర్లు, రమణయ్య, శ్రీను, చిన్నా, జి నాగరాజు, సుబ్బారావు, చాతరాజుపల్లి శ్రీనివాసులు, షేక్ మస్తాన్‌వలి, కె.దుర్గారావు, జి.కృష్ణయ్య తదితరులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నా భరోసా ఇచ్చారు.

విజయం వైఎస్సార్ సీపీదే

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్


మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: రాష్ట్రంలో ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా చివరకు విజయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని యర్రగొండపాలెం ఆ పార్టీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పార్టీ కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో గంటవానిపల్లె, కొత్తూరు, కటకానిపల్లె, చింతల అగ్రహారం గ్రామాల్లో బుధవారం ఆయన మన ఊరికి మన చంద్రశేఖరన్న కార్యక్రమం నిర్వహించారు. తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి సీఎం జగన్ ప్రజల కళ్లల్లో ఆనందాన్ని నింపారని కొనియాడారు. రానున్న సీజన్‌లో నల్లమల సాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపి ఆ ప్రాంత ప్రజల కలలను నెరవేర్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. చంద్రబాబు, పవన్‌లకు గెలిచే దమ్ములేక పొత్తులు పెట్టుకుంటున్నారని విమర్శించారు. మీకు మేలు జరిగితే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తెల్లవారు జామునే పింఛన్ అందాలన్నా, పిల్లల చదువులు సక్రమంగా సాగాలన్నా, ఖరీదైన వైద్యం పేదలకు అందాలన్నా ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అసెంబ్లీ అభ్యర్థి అయిన తనను, పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని తాటిపర్తి ప్రజలను కోరారు. సర్పంచ్‌లు యక్కంటి రమాదేవి, పిక్కిలి కోటిలింగం, ఎంపీటీసీలు పొందుగుల నాగమల్లేశ్వరి, పుప్పాల బబిత, నాయకులు బొటుకు లక్ష్మయ్య, సింగంశెట్టి నడిపిరాములు, బాలవెంకటేశ్వర్లు, దొడ్డా చంద్రశేఖరరెడ్డి, దొందేటి వెంకటేశ్వరరెడ్డి, దొందేటి కృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, నలబోతుల వెంకటేశ్వర్లు, దండా లింగారెడ్డి, దుగ్గెంపూడి వెంకట నారాయణరెడ్డి, రావిళ్ల వెంకటేశ్వర్లు, బొల్లేపల్లి సీతయ్య, దూదేకుల నాసరయ్య, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, యర్రగొండపాలెం సర్పంచి అరుణాబాయి, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూదేకుల రసూల్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు


ఓబులక్కపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

పొదిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం, సలకనూతల, కంభాలపాడు, పోతవరం, మాదాలవారిపాలెం దొండ్లేరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ జియాఉల్‌హక్, సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జి.కోటయ్య, ఆర్ఐ కె.సుబ్బారావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

నేడు తాటిపర్తి ఎన్నికల ప్రచారం

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ మండలంలో గురువారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి తెలిపారు. ఒడ్డుపాలెంలో ఉదయం, ఒడ్డుపాలెం ఎస్సీ కాలనీలో 11 గంటలకు, కంకణాలపల్లిలో సాయంత్రం పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని పోలిరెడ్డి కోరారు.

ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ‘అన్నా’


ప్రచారంలో పాల్గొన్న చైతన్య, బాలమురళీకృష్ణ, ఇస్మాయిల్ తదితరులు

మార్కాపురం: ప్రజల కష్టసుఖాల్లో అన్నా రాంబాబు తోడుగా ఉంటారని, మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబుతో పాటు ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ యువ నాయకుడు అన్నా కృష్ణచైతన్య విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన పొదిలి పట్టణంలోని 26వ వార్డులోని తూర్పుద్వారం, సత్యనారాయణస్వామి గుడి వీధి, విజయలక్ష్మి స్ట్రీట్, శ్రావణి హాస్పిటల్ ప్రాంతం, పొత్తంవారి వీధి, కూరగాయల మార్కెట్ ప్రాంతంలో పర్యటించారు. ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరించి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. పొదిలి, మార్కాపురానికి సాగర్ నీరు, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురంలో మెడికల్ కాలేజీ, షాదీఖానా నిర్మాణం, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి కార్యక్రమాలు సీఎం వైఎస్ జగన్ పాలనలోనే పూర్తవుతున్నాయని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పార్టీ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషగిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ పానుగంటి మురళీ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టి.బాలసుబ్బారావు, పట్టణ ఆర్యవైశ్య సంఘ కోశాధికారి ఆర్.రమేష్, గుంటక వెంకటరెడ్డి, ఉత్తమ్, కౌన్సిలర్ చాటకొండ చంద్ర, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి


ప్రచారం చేస్తున్న కల్పనరెడ్డి, పక్కన మహిళలు

గిద్దలూరు రూరల్: ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని వైఎస్సార్ సీపీ గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి సతీమణి కల్పన కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని గణేష్ నగర్, ప్రశాంతినగర్, క్లబ్ రోడ్డు, గర్రెవారి వీధుల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలన్నారు. గడప గడపకు ప్రభుత్వ పథకాలను చేరవేసిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని గుర్తుచేశారు. వైస్ చైర్మన్‌లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, కౌన్సిలర్లు దొంతా లక్ష్మీదేవి, మానం బాలిరెడ్డి, కంచిపల్లె సర్పంచి సమాధుల వెంకట రాజమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కోటా రఘు, పర్వారి నాగేశ్వరరావు, బొప్పూరి మత్తయ్య, పాలుగుళ్ల నరసింహారెడ్డి, కావేటి ఈశ్వర్‌నాయుడు, షేక్ మస్తాన్‌వలి, పగడాల వెంకటేశ్వర్లు, ముద్దర్ల శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు బాదం గోపాల్, కోటా సత్యనారాయణ, గర్రె వెంకట సుబ్బారావు, బండారు నిర్మలాదేవి, బెల్లం రమాదేవి, పాలుగుళ్ల అనసూయ, దేమా శ్రీరాముల యాదవ్, అపర్ణరెడ్డి పాల్గొన్నారు.

10 మంది వలంటీర్లు రాజీనామా


ఎంపీడీఓ చందనకు రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు


తర్లుపాడులో ఎంపీడీఓకు రాజీనామా సమర్పిస్తున్న వలంటీర్లు


రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్ల, పెద్దయాచవరం, గజ్జలకొండ గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఎస్.గాలిరెడ్డి, ఎల్.శివపార్వతి, జి.ఆత్మారాములు, ఎస్.ఏసయ్య, ఎం.రామాంజనేయరెడ్డి, పి.కొండగురవయ్య, ఎస్.ఏసన్న, పి.పిచ్చయ్య, పి.వెంకటేశ్వర్లు, చల్లా శ్రావణి, ఎస్.సుబ్బయ్య తమ రాజీనామా పత్రాలను మార్కాపురం ఎంపీడీఓ తోట చందనకు బుధవారం అందజేశారు. తమకు రాజకీయాలు ఆపాదించి, కించపరిచేలా మాట్లాడిన నాయకులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెబుతామని, సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు గెలిపించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

నలుగురు వలంటీర్ల రాజీనామా

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లికి చెందిన వలంటీర్లు ఎస్ విజయకుమార్, డి.విజయమణి, కె.లక్ష్మీ ప్రసన్న, కె.సన్నిబాబు బుధవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు తర్లుపాడులో వారు రాజీనామా పత్రాలు సమర్పించారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై కొందరు స్వలాభం కోసం రాజకీయాలు ఆపాదించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఇప్పటికే మండలంలోని కలుజువ్వలపాడు, నాగేళ్లముడుపు, పోతలపాడుకు చెందిన సుమారు 30 మందికి పైగా వలంటీర్లు రాజీనామా చేశారు.

ఇద్దరు వలంటీర్లు రాజీనామా

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు తమ వలంటీర్ల ఉద్యోగాలు అడ్డుగా ఉన్నాయంటూ ఇద్దరు వలంటీర్లు బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వి.శ్రీనివాసరావును కలిసి రాజీనామా పత్రాలు అందజేశారు. పట్టణంలోని రాచర్ల రోడ్డు సచివాయలం పరిధిలో నారాయణరెడ్డి, క్లబ్ రోడ్డు సచివాలయం మాధవ్‌లు జగనన్నపై అభిమానంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వలంటీరు ఉద్యోగాలు అడ్డుగా భావించి రాజీనామాను కమిషనర్‌కు అందజేశారు.

కేజీబీవీ ప్రవేశాల దరఖాస్తు గడువు నేటితో పూర్తి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్(ఎంపీసీ)లో ప్రవేశానికి దరఖాస్తు గడువు గురువారంతో పూర్తవుతుందని ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్(ఎంపీసీ)లో 40 మందికి సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8500723716ను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన బీజేపీ నాయకులు


ఎమ్మెల్యే కేపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న సుబ్రహ్మణ్యం

కంభం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ఆ పార్టీ అభ్యర్థి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బల్లారపు సుబ్రహ్మణ్యం ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడంతో పాటు 30 కుటుంబాలను వైఎస్సార్ సీపీ చేర్చారు. వీరందరినీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, సొసైటీ చైర్మన్ ఫజుల్లా రహమాన్, ఉప సర్పంచి ఖాసిం, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, హైకోర్టు న్యాయవాది దేవరకొండ వెంకట్, సబ్బసాని సాంబశివారెడ్డి, ఆరీఫ్, హుస్సేన్‌బాషా, రఫీ, మున్నా, బాషు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

దొనకొండ: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి సూచించారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలు లేనందున గ్రామాల్లో నీటి సమస్య ఉంటుందని, అలాంటి సమస్యను ప్రత్యామ్నాయ మార్గంగా అధికారులు ఆలోచించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పది రోజుల్లో సాగర్ జలాలు సరఫరా అవుతాయని, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నీటిని సమ్మర్ స్టోరేజీలకు నింపుకోవాలన్నారు. 11 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తెలిపారు. ఎంపీడీఓ వసంతరావునాయక్ మాట్లాడుతూ మన మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని, గ్రామాల్లోని ప్రజలు సమస్యలుంటే తమకు తెలియజేయాలన్నారు. యర్రబాలెం గ్రామానికి నీటి సమస్య ఉందని, గ్రామంలో బోర్లు ఉన్నా మోటార్లు కొరతతో నీటికి ఇబ్బంది పడుతున్నామని, పంచాయతీ వారు రెండు మోటార్లు సరఫరా చేయాలని గ్రామానికి చెందిన బత్తుల వెంకట సుబ్బయ్య సమావేశంలో కోరారు. స్పందించిన ఎంపీడీఓ తాము గ్రామానికి వచ్చి సమస్య తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలు శాఖల అధికారులు, కో ఆప్షన్ షేక్ గఫార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

15న దివ్యాంగులకు స్క్రీనింగ్ క్యాంపు

బేస్తవారిపేట: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో 3–17 ఏళ్లలోపు దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందించేందుకు మార్కాపురం జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో ఈ నెల 15వ తేదీన క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి తెలిపారు. పిల్లల ఆధార్, మెడికల్ సర్టిఫికెట్, ఇన్‌కం లేదా రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు దివ్యాంగ పిల్లవాడు, సంరక్షకులు హాజరు కావాలని కోరారు. దివ్యాంగ పిల్లలు అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారై ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9951302696 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.